సాక్షి నల్లగొండ

ఆదివారం । 27 । ఆగస్టు । 2023



30 ఏళ్లుగా గుడిసెలోనే..
ఆసరా పింఛన్‌నే ఆధారంగా దివ్యాంగులైన ఓ తల్లీకుమారుడు 30 ఏళ్లుగా గుడిసెలోనే నివాసముంటున్నారు. - 8లో



బాబోయ్.. దొంగలు !
కోదాడ పట్టణ పరిధిలోని వివిధ వార్డుల్లో వరుసగా జరుగుతున్న దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. - 8లో



పవిత్రోత్సవాలకు అంకురార్పణ
యాదాద్రిలో శనివారం సాయంత్రం శ్రీస్వామి వారి పవిత్రోత్సావాలకు శ్రీకారం చుట్టారు. - 8లో

న్యూస్‌రీల్

అక్రమ సర్దుబాట్లను రద్దు చేయాలి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నల్లగొండ : విద్యాశాఖలో అక్రమ సర్దుబాట్లను తక్షణమే రద్దు చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్యే నర్సిరెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ సంఘం నాయకులు కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ అక్రమంగా సర్దుబాటు చేసిన వాటిని రద్దు చేసి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సైదులు, వెంకన్న, శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఓటరు జాబితా పారదర్శకంగా ఉండాలి



అధికారులతో చర్చిస్తున్న అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

నకిరేకల్ : ఓటరు జాబితా పారదర్శకంగా ఉండాలని అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆదేశించారు. ఓటర్ జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా నకిరేకల్‌లోని జెడ్పీ హైస్కూల్, చీమలగడ్డలోని పోలింగ్ స్టేషన్లను ఆయన సందర్శించారు. పోలింగ్ బూత్ అధికారులతో మాట్లాడారు. జాబితాలో తప్పులు లేకుండా సవరించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రసాద్‌నాయక్ తదితరులు ఉన్నారు.

29న జిల్లా స్థాయి క్రీడా పోటీలు

నల్లగొండ టూటౌన్ : భారత హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఈనెల 29న నల్లగొండలోని ఇండోర్ స్టేడియంలో జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి మక్బూల్ అహ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 నుంచి 17 ఏళ్లలోపు బాల, బాలికలకు బ్యాడ్మింటన్, 14 నుంచి 17 ఏళ్ల లోపు, 19 ఏళ్ల పైబడిన వారికి చెస్ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. హాకీ పోటీలు ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 29న ఉదయం 8 గంటల లోపు బ్యాడ్మింటన్, చెస్ క్రీడాకారులు ఇండోర్ స్టేడియం, హాకీ క్రీడాకారులు ఔట్ డోర్ స్టేడియానికి రావాలని సూచించారు.

పర్యావరణాన్ని కాపాడాలి



వివరాలు తెలుసుకుంటున్న డీఏఓ సుచరిత

కేతేపల్లి : రైతులు తమ పొలం గట్లపై మొక్కలు నాటుకుని పర్యావరణ సమతుల్యతను కాపాడాలని జిల్లా వ్యవసాయ అధికారిణి(డీఏఓ) వై.సుచరిత సూచించారు. హరితహారంలో భాగంగా శనివారం కేతేపల్లి మండలంలోని ఉప్పలపహాడ్ గ్రామంలో ఆమె పొలం గట్లపై రైతులతో కలసి మునగ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులంతా పొలం గట్లపై అనుకూలమైన టేకు, మునగ మొక్కలను నాటుకోవాలని సూచించారు. అనంతరం కేతేపల్లిలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రంలోని ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల నిల్వ వివరాలు తెలుసుకున్నారు. ఆమె వెంట నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, ఉప్పలపహాడ్ సర్పంచ్ శశికళ, ఏఓ బి.పురుషోత్తం, ఏఈఓ బాలరాజు ఉన్నారు.

సెమినార్ నిర్వహించాలి

నల్లగొండ: జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సెప్టెంబర్ 5వ తేదీ లోగా 8 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు 'మిల్లెట్స్ మంచి ఆహారం' అనే అంశంపై సెమినార్ నిర్వహించాలని డీఈఓ భిక్షపతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెమినార్ నిర్వహించి విజేతలైన విద్యార్థుల వివరాలను జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతికి అందజేయాలని సూచించారు. విజేతలకు జిల్లా స్థాయిలో సెమినార్ నిర్వహించి రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారి లక్ష్మీపతిని సంప్రదించాల్సిందిగా సూచించారు.

నీళ్లు లేక.. బీళ్లాయే!

నాగార్జునసాగర్ ఆయకట్టులో కరువు ఛాయలు

- ఎగువ నుంచి వరద రాకపోవడంతో కాల్వలకు విడుదల కాని నీరు
- బోర్లు, బావుల ఆధారంగా కొంతమేర వరి నాట్లు
- అవి కూడా.. నీరందక ఎండుముఖం
- దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు



హాలియాలో బీళ్లుగా దర్శనమిస్తున్న సాగర్ ఆయకట్టు భూములు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఉమ్మడి జిల్లాలో ఆగస్టు నెలాఖరు నాటికి పచ్చగా కళకళలాడాల్సిన పంట పొలాలు బీళ్లుగా మారాయి. సీజన్ ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు సాగర్, ఏఎమ్మార్పీ ఆయకట్టు కింద సగం కూడా సాగు కాలేదు. నారుమడులు పోసినా నీళ్లు లేక నాటేయలేదు. బోరు, బావులు ఉన్న రైతులు కొంతమేర నాట్లు వేసినా అవి ఎండిపోతున్నాయి. దీంతో సాగర్ ఆయకట్టు పరిధిలో కరువుఛాయలు అలముకున్నాయి.

ఎడమ కాల్వ కింద లక్షన్నర ఎకరాల్లోనే సాగు

నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో 3,81,022 ఎకరాల్లో వరి సాగు కావాల్సి ఉంది. ప్రస్తుతం బోర్లు, బావుల ఆధారంగా లక్షన్నర ఎకరాల వరకే వరకే సాగు చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఇక ఏఎమ్మార్పీ కింద కూడా రెండు లక్షల ఎకరాల్లో సాగు చేయాల్సి ఉన్నా 70 వేల ఎకరాల్లోనే వరి సాగు చేసినట్లు అధికారులు లెక్కలు వేస్తున్నారు. మన రాష్ట్రంతోపాటు ఎగువ రాష్ట్రాల్లోనూ వర్షాలు లేక సాగర్‌లోకి కొత్తగా నీరు చేరలేదు. దీంతో ఆయకట్టులో గడిచిన పదేళ్లలో ఇలాంటి పరిస్థితి రాలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పెరిగిన తాగునీటి అవసరాలు..

నాగార్జునసాగర్‌కు ఏటా ఆగస్టులోనే వరదలు ప్రారంభమవుతాయి. గడిచిన పదేళ్లలో ఈ నెలలోనే ఎక్కువగా ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. కానీ, ఈసారి ఆ పరిస్థితి లేదు. శ్రీశైలం జలాశయం నుంచి విద్యుదుత్పత్తి ద్వారా కొద్దిపాటి నీరు సాగర్‌కు వస్తున్నా.. ఆ నీరు తాగునీటి అవసరాలకే సరిపోయే పరిస్థితి ఉంది. తాగునీటి అవసరాలు తక్కువగా ఉన్న రోజుల్లో సాగర్‌లో 515 అడుగుల స్థాయిలో నీటి మట్టం ఉన్న సమయంలోనూ ఆరుతడి పంటలకు నీటిని విడుదల చేసేవారు. ఇప్పుడు తాగునీటి అవసరాలు పెరిగాయి. అప్పట్లో హైదరాబాద్‌కు ఒక్క పైప్‌లైన్ ఉండగా.. ప్రస్తుతం మూడు పైప్‌లైన్ల ద్వారా నీటిని తరలిస్తున్నారు. మిషన్ భగీరథ, ఆయకట్టు ప్రాంతంలోని పట్టణాలు, గ్రామాల్లో తాగు నీటికి 30 టీఎంసీల నీరు అవసరం ఉంటోంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో నీటి విడుదలపై నిర్ణయం తీసుకునే అవకాశం కనిపించడం లేదు. సెప్టెంబర్‌లోనైనా ఎగువనుంచి వరదలు వస్తే నీటిని విడుదలకు అవకాశముంటుందని సాగునీటి శాఖ అధికారులు చెబుతున్నారు.



హుజూర్‌నగర్‌లో ఎండిపోతున్న వరి చేను

డెడ్ స్టోరేజీ పైన 30 టీఎంసీలు..

నాగార్జునసాగర్ జలాశయంలో గరిష్ట నీటిమట్టం 590 అడుగులు (312.5050టీఎంసీలు)కాగా.. ప్రస్తుతం 522.30 అడుగులు (153.5035 టీఎంసీలు)గా ఉంది. ఎగువన శ్రీశైలం గరిష్ట నీటిమట్టం 885 అడుగులు (215.807టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 855.60 అడుగుల (93.36టీఎంసీలు) నీరుంది. సాగర్ జలాశయంలో డెడ్ స్టోరేజీకి పైన కేవలం 30 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఆ నీరు తాగునీటికి మాత్రమే సరిపోయే అవకాశా ఉన్నాయి. ఇప్పటికే ఆయకట్టులో చెరువులు, కుంటలు ఎండిపోయి తాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఎగువ నుంచి శ్రీశైలంలోని 100టీఎంసీల నీరు వస్తే తప్ప సాగర్ జలాశయంలోకి వరద వచ్చే పరిస్థితులు కనపడటం లేదు. సాగర్ ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేయాలంటే ఒక్కో కాల్వకు 132టీఎంసీలు అవసరం. మొదటి జోన్ వరకైనా ఆరుతడి పంటలకు నీటిని విడుదల చేయాలన్నా ఎగువ నుంచి వరద వస్తే తప్ప విడుదల చేసే పరిస్థితి కనిపించడం లేదు.

పదేళ్లలో సాగర్ కాల్వకు నీటిని విడుదల చేసిన తేదీ, విడుదల చేసే రోజు ఉన్న నీటిమట్టం

సంవత్సరం	విడుదల తేదీ	అప్పటి నీటి మట్టం
2013	ఆగస్టు 2	550.50
2014	ఆగస్టు 6	515.80
2015	అక్టోబర్ 17	510.30
2016	ఆగస్టు 24	514.30
2017	అక్టోబర్ 31	576.40
2018	ఆగస్టు 24	563.62
2019	ఆగస్టు 12	560.11
2020	ఆగస్టు 8	557.07
2021	ఆగస్టు 2	587.02
2022	జూలై 29	552.08

ప్రస్తుతం శనివారం వరకు 522.30 (152.95 టీఎంసీల) అడుగుల నీటిమట్టం ఉంది.

చెరువులు నింపాలి



తాగునీటి అవసరాల కోసం ప్రధాన కాల్వకు నీరు విడుదల చేస్తున్నందున అధికారులు మండలంలోని ఆయకట్టు చెరువులను నింపి పంటలకు జీవం పోయాలి. చెరువులు నింపితే పంటలు చేతికందుతాయి.

– రేపాక లక్ష్మీపతి, రైతు, గుర్రంపోడు



నిడమనూరు మండలం పార్వతీపురం వద్ద ఎండిపోయిన నారుమడి



హుజూర్‌నగర్‌లో బోరు వేస్తున్న రైతు

సాగు భూములు బీళ్లుగా మారాయి



సాగర్ ఎడమకాల్వకు నీటిని విడుదల చేయకపోవడంతో పంట పొలాలు బీళ్లుగా మారాయి. గతంలో సాగర్‌లో కనీస నీటి మట్టం ఉన్నా ఎడమ కాలువకు నీరు ఇచ్చారు. ఇప్పుడు కూడా నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలి.

– కాసర్ల వెంకట్, రైతు, మునగాల

బోర్లలో నీరు ఇంకి పోయింది



వర్షాలు కురవకపోవడంతో బోర్ల నీరు అందడం లేదు. అదనపు ఖర్చు చేసి బోరు పైపులు కిందకు దింపినా ఫలితం లేకుండా పోయింది. సాగర్ నిండి నీరు వస్తుందనుకొని రూ.8 వేలు ఖర్చు పెట్టి నారు పోశా. అంతా ఎండిపోతోంది.

– చింతకాయల యాదయ్య, రైతు, త్రిపురారం

నేను చెప్పిన వారికే నకిరేకల్ టికెట్

- కార్యకర్తల అభిప్రాయం మేరకే అభ్యర్థి ఎంపిక
- ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- నకిరేకల్ నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం



బి.వెల్లెంలలో మాట్లాడుతున్న ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నార్కట్‌పల్లి : కార్యకర్తల అభిప్రాయం మేరకు నకిరేకల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిని ఎంపిక చేస్తామని, తాను ప్రతిపాదించిన వ్యక్తికే అధిష్టానం టికెట్ ఇస్తుందని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం నార్కట్‌పల్లి మండలం బి.వెల్లెంల గ్రామంలోని తన తోటలో కాంగ్రెస్ పార్టీ నకిరేకల్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గెలిపించిన అభ్యర్థి పార్టీ మారడం వల్ల ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఈనెల 28న నార్కట్‌పల్లిలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి అందరి అభిప్రాయం మేరకు నూతన అభ్యర్థిని ఎంపిక చేసుకుని.. గెలిపించుకుందామని చెప్పారు. నకిరేకల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టంగా ఉందని.. ఇక్కడ సరైన అభ్యర్థిని నిలబెడదామని కార్యకర్తలకు వివరించారు. ఇప్పటి వరకు ఎమ్మెల్యేలుగా పని చేసిన వారు ఏనాడూ ప్రజల సమస్యలను పట్టించుకోలేదని.. ఆస్తులు కూడబెట్టుకోవడానికి మొగ్గు చూపారని ధ్వజమెత్తారు. అభివృద్ధి కోసం పార్టీ మారినట్లు చెప్పేవారు బి.వెల్లెంల – ఉదయ సముద్రం ప్రాజెక్టు పూర్తి చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. ఓ నాయకుడికి బీఆర్‌ఎస్ పార్టీ టికెట్ ఇవ్వకపోవడంతో కాంగ్రెస్ టికెట్ వస్తోందని సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారం తప్పు అని చెప్పారు. బీఆర్‌ఎస్ టికెట్ రాదని తెలిశాక కేసీఆర్ ఫొటో పక్కన పడేసి కాంగ్రెస్ అంటున్నాడని మాజీ ఎమ్మెల్యేను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఫోర్టిఫైడ్ బియ్యంపై అపోహలు వద్దు



మాట్లాడుతున్న ఎఫ్‌సీఐ మేనేజర్ సుఖేష్

మిర్యాలగూడ : భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ) అందిస్తున్న ఫోర్టిఫైడ్ రైస్‌పై ప్రజలు అపోహలు మానుకోవాలని ఎఫ్‌సీఐ మిర్యాలగూడ మేనేజర్ బి.సుఖేష్ పేర్కొన్నారు. శనివారం ఎఫ్‌సీఐ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మిర్యాలగూడ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూక్ష్మ పోషక లోపాలను తొలగించేందుకుగాను ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా అయ్యే బియ్యం అత్యంత నాణ్యతతో ఉండాలనే ఉద్దేశంతో ఐరన్, పోలిక్ యాసిడ్, బి12 వంటి మినరల్స్‌తో కూడిన ఫోర్టిఫైడ్ రైస్‌ను తయారు చేశారన్నారు. ప్రజలకు దీనిపై అవగాహన లేకపోవడం వల్ల ప్లాస్టిక్ బియ్యమని అపోహ పడుతున్నారని ఇది సరైంది కాదన్నారు. పోర్టిఫైడ్ బియ్యం తినడం వల్ల ఎనీమియా వంటి రోగాలకు చెక్ పెట్టే అవకాశం ఉందన్నారు. ఈ సంవత్సరం నుంచి 1,55,236 మెట్రిక్ టన్నుల బలవర్థకమైన బియ్యాన్ని సేకరించామని, వాటిలో దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజల అవసరాలను తీర్చేందుకు 90,205 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తామని తెలిపారు. అనంతరం గోదాంలలో నిల్వ చేసే విధానాన్ని, రోజువారి తీసుకునే జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో మేనేజర్లు రమేష్, శేఖర్ బాబు, శివకుమార్, సందీప్, సిబ్బంది ఉన్నారు.

ఒక్కరోజే 8 లక్షల మొక్కలు..



నకిరేకల్‌లో మొక్కనాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నల్లగొండ : స్వతంత్ర్య భారత వజ్రోత్సవ ముగింపు కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కోటి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో భాగంగా నల్లగొండ జిల్లాకు ఎనిమిది లక్షల మొక్కలు నాటాలని టార్గెట్ నిర్ణయించగా శనివారం జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో 8 లక్షల మొక్కలు నాటి టార్గెట్‌ను పూర్తి చేశారు. నూటికి నూరు శాతం మొక్కలు నాటాలని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలకు వారం క్రితమే కలెక్టర్ కర్ణన్ ఆదేశాలు జారీ చేశారు. ఒక్కరోజే ఎనిమిది లక్షల మొక్కలు నాటాలని టార్గెట్ నిర్ణయించగా శనివారం ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని 8,02,100 మొక్కలు నాటి విజయవంతం చేశారు.

పర్యావరణాన్ని రక్షించాలి

కనగల్ : మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ అన్నారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కోటి వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం కనగల్ మండలం శేరిలింగోటం గ్రామంలో కలెక్టర్ మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు విరివిగా నాటాలని సూచించారు. అదేవిధంగా కనగల్ ఎక్స్ రోడ్డులో ఎంపీపీ ఎస్‌కే కరీంపాష, తహసీల్దార్ జి. జ్యోతి, ఎంపీడీఓ డి.సోమసుందర్‌రెడ్డి మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో పీఆర్ ఏఈ శ్రీనివాస్ ఏపీఓ సుధాకర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సౌజన్య, సర్పంచ్ ఆవురేశి క్రాంతిశ్రీనివాస్, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయం



చెక్కు అందజేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి పక్కన ఎంపీ బడుగుల, ఎమ్మెల్యే భాస్కర్‌రావు తదితరులు

- శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి

మిర్యాలగూడ : రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఎన్వీ గార్డెన్స్‌లో నియోజకవర్గ వ్యాప్తంగా బీసీలకు రూ.లక్ష ఆర్థిక సాయం కింద 300 మంది లబ్ధిదారులకు రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుతో కలిసి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గుత్తా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసం రైతుబంధు కింద 60లక్షల మంది రైతులకు రూ.76 వేల కోట్లు అందించామన్నారు. 24గంటల ఉచిత విద్యుత్‌తోపాటు రుణమాఫీ చేసి రైతుల జీవితాల్లో వెలుగులు నింపామని చెప్పారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో రూ.600 కోట్లతో ఐదు లిఫ్టులను, దామరచర్లలో రూ.30 వేల కోట్లతో థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మిస్తున్నామని గుర్తు చేశారు. రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీకి ముఖ్యమంత్రి అభ్యర్థి కేసీఆర్ అని కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో చెప్పాలన్నారు. ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సహకారంతో మిర్యాలగూడ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశానని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, జిల్లా కోఆప్షన్ మెంబర్ మోసిన్‌అలీ, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కుర్ర విష్ణు, ఎంపీపీలు నందినిరవితేజ, నూకల సరళాహన్మంతరెడ్డి, బాలాజీనాయక్, జెడ్పీటీసీలు ఇరుగు మంగమ్మ, లలిత, నాయకులు అన్నభీమోజు నాగార్జునచారి, చిట్టిబాబునాయక్, నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, బంటు శ్రీనివాస్, రాములుగౌడ్, మట్టపల్లి సైదులుయాదవ్, పాలుట్ల బాబయ్య, రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా రూపకల్పన

నల్లగొండ : ఓటరు జాబితా రూపకల్పనకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, రాష్ట్ర జాయింట్ ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్, ఇతర రాష్ట్రస్థాయి అధికారులతో కలిసి జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ, పోలింగ్ కేంద్రాల ధ్రువీకరణ, అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటింగ్ టర్న్‌అవుట్ పెంపునకు తీసుకోవాల్సిన చర్యలు, నూతన ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితాలో లింగ నిష్పత్తి, జనాభా ఓటర్ల నిష్పత్తి తదితర అంశాలపై కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. జిల్లా నుంచి కలెక్టర్ కర్ణన్ మాట్లాడుతూ ఓటరు జాబితా రూపకల్పనకు చేపడుతున్న చర్యలను వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు హేమంత్ కేశవ్ పాటిల్, జె.శ్రీనివాస్, ఆర్డీఓలు రవి, శ్రీరాములు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ కర్ణన్ అదనపు కలెక్టర్లు

ఎమ్మెల్యేల అవినీతి పెరిగిపోయింది

- ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్ : బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల అవినీతి అక్రమాలు, భూ కబ్జాలతో తెలంగాణ ప్రజానీకం విసిగిపోయారని, వారిని ఇంటికి పంపించేందుకు సిద్ధంగా ఉన్నారని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని ఇందిరా భవన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాటాడారు. హుజూర్‌నగర్‌లో ఎంతో మంది ఎమ్మెల్యేలుగా పనిచేసినా ఎవరూ కూడా ఇంత అహంకారంతో విర్రవీగలేదన్నారు. ఎమ్మెల్యే అంటే.. నియోజకవర్గంలో ల్యాండు, శాండు, వైను, మైను, కమీషన్లు, అవినీతి, అక్రమ దందాలేనని ఆయన ఆరోపించారు. నియోజకవర్గంలో వందల కోట్లు భూములు, హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో వేల కోట్ల విలువ గల భూములు మాయం అవుతున్నాయని, వీటి వెనుక ఎవరు ఉన్నారో చెప్పాలని ఉత్తమ్ డిమాండ్ చేశారు. తన సంతకం ఫోర్జరీ చేశారని మున్సిపల్ కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు దానిపై అతీగతీ లేదన్నారు. అందరి నాటకానికి తెరపడే రోజు దగ్గరలోనే ఉన్నదని, ప్రజలు తగిన తీర్పు ఇస్తారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రాబోయే 90 రోజులు కష్టపడి పనిచేయాలని కోరారు. సాగర్ నుంచి కనీసం ఆరుతడి పంటలకు వెంటనే నీరు విడుదల చేయాలని, ఎండుతున్న పంటలను కాపాడాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైల్వే జోనల్ మెంబర్ యరగాని నాగన్న, పీసీసీ సభ్యులు దొంగరి వెంకటేశ్వర్లు, అరుణ్ కుమార్ దేశముఖ్, ఎంపీపీ గోపాల్ నాయక్, మోతీలాల్ నాయక్, చిన్న వెంకటరెడ్డి, ఎన్.సుబ్బారావు, ఎన్.కొండారెడ్డి, మంజునాయక్, కె.భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

గరిడేపల్లి : ఉరేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన గరిడేపలికల మండలం పొనుగోడు గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గరిడేపల్లి ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామానికి చెందిన కంచర్ల మంజుల(39) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురైంది. ఈ నేపథ్యంలోనే ఇంట్లోనే చీరతో ఉరివేసుకుంది. ఇరుగుపొరుగు వారు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది. మృతురాలికి ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. మృతురాలి తమ్ముడు బుసిరెడ్డి జనార్దన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

నర్సరీ దగ్ధం

నార్కట్‌పల్లి : గుర్తుతెలియని వ్యక్తులు నర్సరీని దగ్ధం చేశారు. ఈ ఘటన నార్కట్‌పల్లి మండల పరిధిలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామ శివారులో చోటు చేసుకుంది. భాదితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డి వద్ద మహమ్మద్ రెండు ఎకరాల భూమిని లీజుకు తీసుకుని కూరగాయల నారు పెంచుతున్నాడు. నర్సరీకి దాదాపు రూ. 30 లక్షల వరకు పెట్టుబడి పెట్టి మిర్చి, టమాటా, వంకాయ, బంతి నారు పెంచుతున్నాడు. రోజు మాదిరిగా గురువారం రాత్రి 8 గంటలకు నర్సరీ నుంచి వెళ్లి తిరిగి శుక్రవారం ఉదయం 6 గంటలకు వచ్చే సరికి నర్సరీ మొత్తం దగ్ధమైంది. సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించాఉ. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ నర్సిరెడ్డి తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో నలుగురిపై కేసు

మోత్కూరు : మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని చెరువు కట్ట వద్ద శనివారం సాయంత్రం స్థానిక పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న నలుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఏమిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి


మణికంఠ (ఫైల్)

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : మఠంపల్లి మండలంలోని తుమ్మలతండాలో ఈ నెల 20వ తేదీన బాణసంచా కాలుస్తుండగా జరిగిన ప్రమాదంలో చింతలపాలెం మండలం పీక్లానాయక్ తండాకు చెందిన భూక్య మణికంఠ (25) గాయపడ్డాడు. అతనిని మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. వారం రోజులుగా అక్కడ చికిత్స పొందుతూ మణికంఠ శనివారం మృతి చెందారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

బాబోయ్.. దొంగలు!

- కోదాడలో నెల రోజుల వ్యవధిలోనే నాలుగు చోరీలు
- నిర్వహణ లేకపోవడంతో పనిచేయని సీసీ కెమెరాలు
- ఆందోళనకు గురవుతున్న కోదాడ పట్టణ వాసులు


కోదాడలో భవాని నగర్‌లో దొంగలు పడ్డ ఇల్లు

కోదాడ: కోదాడలో వరుసగా జరుగుతున్న దొంగతనాలతో ప్రజలు బేలెత్తిపోతున్నారు. పట్ట ణంలో దొంగలు నిత్యం సంచరిస్తూ తాళం వేసిన ఇళ్లనే టార్గెట్‌గా చేసుకొని చోరీలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. నెల రోజుల వ్యవధిలోనే వరుసగా నాలుగు దొంగతనాలు చోటు చేసుకోవడంతో పట్టణ ప్రజలకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. దొంగలు పగలే తుపాకులు పట్టుకొని చోరీలకు పాల్పడుతున్నా పోలీసులు చర్యలు తీసుకోలేకపోతున్నారనే విమర్శలు వస్తున్నాయి. దీనికితోడు గతంలో దాతల సాయంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిర్వహణను పట్టించుకోవడం లేదని, దీంతో పట్టణంలో ఏం జరిగినా చిన్న క్లూ కూడా దొరకని పరిస్థితి నెలకొందని పలువురు పేర్కొంటున్నారు. పోలీసులు రాత్రి పూట గస్తీని పెంచాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఇటీవల జరిగిన చోరీ ఘటనలు..

- నెల రోజుల క్రితం నయానగర్‌లో నివాసముంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఇంట్లో దొంగలు పడి 10 తులాల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు.
- పది రోజుల క్రితం గోపిరెడ్డినగర్‌లో నివాసం ఉండే మున్సిపల్ ఏఈ ఇంట్లో రాత్రి 10 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి 29 తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు.
- మూడు రోజుల క్రితం భవానినగర్‌లో నివాసముంటున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇంట్లో సుమారు 30 తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.రెండు లక్షల నగదు చోరీకి గురయ్యాయి.

పూర్తి స్థాయి అధికారులు ఉన్నా..

కోదాడ పట్టణంలో గతంలో ఒక స్టేషన్, ఒక ఎస్‌ఐ మాత్రమే ఉండేవారు. కోదాడ పట్టణ ట్రాఫిక్‌తో పాటు దొంగతనాల విషయంలో నిత్యం నిఘాపెట్టేవారు. ఎస్‌ఐ స్థాయి అధికారి నిత్యం పట్టణంలో మోటార్‌సైకిల్ మీద సంచరించేవారు. ప్రస్తుతం పట్టణంలో టౌన్, రూరల్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌తో పాటు డీఎస్పీ, రూరల్ సర్కిల్ కార్యాలయంతో పాటు పట్టణ స్టేషన్‌లో సీఐ స్థాయి అధికారి, ఇద్దరు ఎస్‌ఐలు, ట్రాఫిక్ ఎస్‌ఐ ఇలా పదుల సంఖ్యలో అధికారులు ఉన్నారు. కింది స్థాయి అధికారులు మినహా ఉన్నతాధికారులు స్టేషన్ దాటి బయటకు రాకపోవడంతో క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంటుందని పట్టణ వాసులు పేర్కొంటున్నారు.

పట్టపగలే తుపాకులు పట్టుకుని

కోదాడ పట్టణంలో పది రోజుల క్రితం శ్రీమన్నారాయణ కాలనీలో పట్ట పగలు జరిగిన దొంగతనం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. కాలనీలో ఉదయం తాళం వేసిన ఇంట్లో దొంగలు ప్రవేశించారు. ఈ విషయాన్ని గమనించిన ఒకరు వారిని అడ్డుకొనే ప్రయత్నం చేయగా.. దొంగలు తుపాకీ చూపించి అతడి బెదిరించి అక్కడి నుంచి పరారయ్యారు. కాగా.. ఈ దొంగతనాల విషయంలో పోలీసులు శుక్రవారం సమావేశం ఏర్పాటు చేసి ప్రజలు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు.

గస్తీ పెంచాం

కోదాడ పట్టణంలో దొంగతనాలు అరికట్టడానికి గస్తీని ముమ్మరం చేశాం. అదనపు సిబ్బందిని కూడా పిలిపించాం. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. డీఎస్పీతో సహా అధికారులు అంతా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు.

– రాము, కోదాడ పట్టణ సీఐ

గర్వంగా ఉంది..

- ఇస్రో శాస్త్రవేత్త కోటగిరి శ్రీలేఖ



నకిరేకల్ : దేశం గర్వించదగిన చంద్రయాన్ – 3 విజయవంతం అవడం, ఈ మిషన్ ప్రాజెక్ట్‌లో ఉండటం ఎంతో ఆనందంగా ఉందంటున్నారు.. నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామానికి చెందిన కోటగిరి శ్రీలేఖ. ఇస్రోలో టెస్టింగ్ అండ్ అనలిస్ట్ కంట్రోల్ ఎలక్ట్రానిక్స్ లాండర్స్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఆమె చంద్రయాన్–3 సక్సెస్‌ను శనివారం ఆమె 'సాక్షి'తో పంచుకున్నారు. వివరాలు ఆమె మాటల్లోనే.. ప్రపంచం చూపు ఇస్రో వైపు ఉంది. ఇలాంటప్పుడు నేను ఇస్రోలో వర్క్ చేస్తున్నందుకు గర్వంగా ఉంది. చేయబోయే పనులకు ఎంతో బూస్టింగ్‌గానూ ఉంది. నేను పుట్టి పెరిగింది నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామం. మా తల్లిదండ్రులు కోటగిరి శంకర్, కోటగిరి పద్మ. సూర్యాపేటలో 8వ తరగతి చదువుకున్నా. ఆ తర్వాత చదువురీత్యా మా అన్నయ్య, నన్ను హైదరాబాద్‌లోనే ఉంచారు. ఐఐటీ జెఈఈలో ర్యాంకు వచ్చాక, మా అన్నయ్య ఇచ్చిన గైడెన్స్‌తో స్పేస్ సైన్స్ తీసుకున్నా. అన్నయ్య టీచింగ్ ఫీల్డ్‌లో ఉండటం కూడా నాకు బాగా హెల్ప్ అయ్యింది. తిరువనంతపురంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీలో చదువు పూర్తయ్యాక ఇస్రోలో జాబ్ వచ్చింది. ఈ పదేళ్లలో ఎన్నో మిషన్ ప్రాజెక్ట్స్‌లో భాగమయ్యాను. వర్క్ షెడ్యూల్స్ ప్రకారం టైమింగ్ గురించి అస్సలు బేరీజు వేసుకోవడం ఉండదు. అచీవ్‌మెంట్ వైపుగానూ దృష్టి ఉంటుంది. ఉద్యోగమూ, కుటుంబమూ రెండింటినీ బ్యాలెన్స్ చేసుకోవడం మన చేతుల్లోనే ఉంటుంది. నా వర్క్ షెడ్యూల్స్‌ని, మా ఐదేళ్ల అమ్మాయి పెంపకం విషయంలో బ్యాలెన్స్ మా కుటుంబం నుంచి ఉండే సపోర్ట్ నాకు పెద్ద బలం.

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

మిర్యాలగూడ అర్బన్: దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. వన్‌టౌన్ సీఐ రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని బైపాస్‌రోడ్డు వై జంక్షన్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో స్కూటీపై వస్తున్న వ్యక్తిని ఆపి వివరాలు అడుగుతుండగా పారిపోయేందుకు ప్రయత్నించడంతో అతడిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా గుంటూరు జిల్లా కేంద్రం శ్రీనివాసరావుపేట కు చెందిన పసుపులేటి సాయినాథ్ బాబు గా గుర్తించారు. కాగా సదరు వ్యక్తి నెల 24న పట్టణంలోని ముత్తిరెడ్డికుంటలో నడుచుకుంటూ వెళుతున్న ఓ మహిళ మెడలో 3తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయినట్లు గుర్తించారు. అంతే కాకుండా గతంలో 2017 నుంచి ఇప్పటి వరకు నగరపాలెం, మేడికొండూరు, నల్లపాడు, మార్ధూరు పోలీస స్టేషన్ల పరిదిలో అనేక కేసులు నమోదయ్యాయని నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ కూడా ఉన్నట్లు గుర్తించారు. దీంతో అతడి వద్ద నుంచి బంగారు గొలుసును స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

కోతుల దాడిలో చిన్నారికి గాయాలు

భూదాన్‌పోచంపల్లి : కోతుల దాడిలో చిన్నారికి గాయాలైన సంఘటన శనివారం సాయంత్రం మున్సిపాలిటీ పరిధిలోని ప్రకాశ్‌నగర్‌లో జరిగింది. ప్రకాశ్‌నగర్‌కు చెందిన ఎక్కందేవి రామకృష్ణ, సంగీతల కుమార్తె రిషిక ఇంటి ఆరుబయట ఆడుకొంటుండగా అటుగా వచ్చిన కోతుల గుంపు చిన్నారిపై దాడి చేశాయి. ఈ దాడిలో చిన్నారికి మెడ, చెవి బాగాన గాయలయ్యాయి. భయపడిన చిన్నారి కేకలు వేయడంలో ఇంటి పక్కనే ఉన్న గర్దాస్ రామస్వామి కర్ర తీసుకొని బయటికి వచ్చి కోతులను తరిమి కొట్టాడు. గత కొద్దిరోజులుగా ప్రకాశ్‌నగర్, మార్కండేయనగర్‌లో కోతుల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వాపోయారు. అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి రక్షించాలని పట్టణ ప్రజలంతా కోరుతున్నారు.

యాదాద్రిలో పవిత్రోత్సవాలకు అంకురార్పణ


తొలి పూజ నిర్వహిస్తున్న ఆచార్యులు


నవధాన్యాలకు పూజ చేస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శనివారం సాయంత్రం శ్రీస్వామి వారి పవిత్రోత్సావాలకు ఆచార్యులు శ్రీకారం చుట్టారు. యాదాద్రి ప్రధానాలయం ముఖ మండపంలో స్వస్తీ వాచనం జరిపించి, అంకురార్పణతో పవి త్రోత్సవాలను ఆగమ శాస్త్ర ప్రకారం ప్రారంభించా రు. ఉత్సవాలకు ఆధ్యుడైన విశ్వక్సేనుడికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పీ ఠంపై మూడు ప్రధాన కలశాలను ఏర్పాటు చేసి గంగా జలంతో గర్భాలయం, పరిసరాలు, క్యూలైన్లతో పాటు ఆలయంలో వేద మంత్రాలు, భాజాభజంత్రీలు, మంగళవాయిద్యాలతో సంప్రోక్షణ గావించారు. అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన యాగశాలలో అంకురార్పణ చేశారు. పుట్ట మట్టిని తెచ్చి వాటిలో నవ ధాన్యాలు, పంచామృతాలను పోసి వాటికి వేదమంత్రముగా పాలికల్లో పోసి ప్రత్యేక పూజలను చేపట్టారు. వేద మంత్రాలతో యాగశాలలో అగ్ని ప్రతిష్ట చేసి దేవతా మూలమంత్రాలతో హవనం నిర్వహించారు. వేద మంత్రాలతో ఆ దోషాలను పరిహారం చేయడమే పవిత్రోత్సవాల సంకల్పమని అర్చకులు తెలిపారు.

పేలిన గ్యాస్ సిలిండర్


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

సూర్యాపేట క్రైం : పాత ఇనుప సామగ్రి దుకాణంలో గ్యాస్ సిలిండర్ పేలిన ఘటన శనివారం సూర్యాపేట పట్టణంలోని బొడ్రాయిబజార్‌లో చోటుచేసుకుంది. చల్లా వెంకన్న 30 సంవత్సరాలుగా బొడ్రాయిబజారులో పాత ఇనుప సామాను దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇరుకు రోడ్డు కావడం.. ఉన్న కొద్దిపాటి స్థలంలోనే సామాన్లు వేయడంతో ఒత్తిడికి గురైన పాత గ్యాస్ సిలిండర్ పేలింది. గ్యాస్ సిలిండర్ పేలడంతో పెద్ద శబ్దం రావడంతో ఆ ప్రాంత వాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. దుకాణంలో ఎవరికి గాయాలు కాలేదు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు.

డీసీఎంఎస్ చైర్మన్‌పై కేసు

సూర్యాపేట రూరల్ : భూమిని ఆక్రమించాడనే అభియోగం మేరకు డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్యపై శనివారం సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గాంధీనగర్‌కు చెందిన ఉగ్గం బుచ్చిరాములుకు సర్వే నంబర్ 337, 338, 339లో 30గుంటల భూమిని ఆక్రమించి దౌర్జన్యంగా ఫంక్షన్‌హాల్ నిర్మిస్తుండగా ప్రశ్నిస్తే చంపుతామని బెదిరించాడని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రామారాకి చెందిన పాలవరపు వేణుకు సంబంధించిన భూమిని కలుపుకొని దాడులకు పాల్పడ్డారని తెలిపారు. తుంగతుర్తికి యలగందుల సంజీవ వరూధిని నగర్‌లో రెండు ప్లాట్లు విక్రయించగా కొన్నాళ్ల తర్వాత ప్లాట్లు లేవని జానయ్య బెదిరించి కబ్జా చేసినట్లు ఫిర్యాదు చేశారని చెప్పారు. బాలెంల గ్రామానికి చెందిన వల్లెం శేఖర్, సూర్యాపేట పట్టణానికి చెందిన పెండెం కృష్ణలు చేసిన ఫిర్యాదు మేరకు జానయ్య యాదవ్‌పై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి

- నల్లగొండ కలెక్టర్ ఆర్.వి కర్ణన్


కలెక్టర్‌ను సన్మానిస్తున్న సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు


హాలియాలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆర్.వి కర్ణన్

హాలియా : 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఆర్.వి కర్ణన్ అన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా హాలియా పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు శిబిరాలను కలెక్టర్ కర్ణన్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓటరు నమోదు దరఖాస్తులు ఎన్ని వచ్చాయి. ఓటర్ జాబితాలో దివ్యాంగ ఓటర్ల గురించి తెలుసుకొని గరుడ యాప్‌లో నమోదు చేశారా అని బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. హాలియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటరు నమోదుకు వచ్చిన 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులతో కలెక్టర్ మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండవ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ 2023 కార్యక్రమంలో భాగంగా ఈనెల 26, 27వ తేదీలు, సెప్టెంబర్ 2, 3వ తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ బూత్‌లలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట హాలియా తహసిల్దార్ జయశ్రీ, బీఎల్‌ఓ అధికారులు తదితరులు ఉన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

చింతపల్లి : అక్టోబర్ 1, 2023 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని నల్లగొండ కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ అన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా చింతపల్లి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను ఆయన సందర్శించి మాట్లాడారు. ఓటరు జాబితాలో సవరణ, మార్పులు, చేర్పులు చేసుకునే కార్యక్రమం ఉంటుందని, బూత్ లెవల్ అధికారులు తమ పోలింగ్ కేంద్రాలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంటూ ప్రజలకు కావాల్సిన సమాచారం ఇవ్వాలని అన్నారు. గ్రామంలో మృతి చెందిన ఓటర్లను గుర్తించి తొలగించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీరాములు తహసీల్దార్ శంషాద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సాయి మందిరంలో కలెక్టర్ పూజలు

చింతపల్లి మండల కేంద్రంలోని షిర్డీ సాయినాథుని దేవాలయంలో నల్లగొండ కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనుంజయ్య, ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, ఊరె కృష్ణయ్య, తడకమళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

కొండమల్లేపల్లి : అక్టోబర్ 1, 2023 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని నల్లగొండ కలెక్టర్ ఆర్.వి.కర్ణన్ అన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం కొండమల్లేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించి ఓటరు నమోదు ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీధర్‌రెడ్డి, హెచ్‌ఎం మంద సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

అడ్డగూడూరు : పీడీఎస్ బియ్యం తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. మండల పరిధిలోని జానకిపురం గ్రామం శివారులో తుర్కపల్లి మండలం భీల్య తండాకు చెందిన గుగులోతు శంకర్, చొల్లరామారం గ్రామ శివారులో రమేష్ బియ్యం రవాణా చేస్తుండగా 9.5క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పురుగు మందుల దుకాణంపై కేసు

హుజూర్‌నగర్ : అనుమతులు, సరైన ధ్రువపత్రాలులేని పురుగు మందుల దుకాణంపై ఇటీవల వ్యవసాయ రెవెన్యూ అధికారులు దాడులు చేసి అక్రమ నిల్వలను సీజ్ చేసిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి పట్టణంలోని లక్ష్మీ సీడ్స్ దుకాణంపై పురుగు మందుల చట్టం 1968 ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఏఓ స్వర్ణ శనివారం తెలిపారు.

వింత ఆకారంలో ఆవుదూడ జననం

అర్వపల్లి: వింత ఆకారంలో ఆవుదూడ జన్మించిన సంఘటన జాజిరెడ్డిగూడెం మండలం అడివెంలలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చెరుకు లింగయ్య ఆవు శనివారం ఈనడానికి ఇబ్బంది పడుతుండగా అర్వపల్లి గోపాలమిత్ర కుంభం సురేందర్‌ను పిలిపించారు. సురేందర్ ఆవుకు వైద్యం చేసి సుఖ ప్రసవం చేసేలా చేశారు. అయితే ఈ ఆవుకు జన్మించిన మగ దూడ వింత ఆకారంలో ఉంది. ఆవు దూడకు మూతిముందు ఏనుగు పిల్లను పోలినవిధంగా తొండం ఆకారం, ఇతర అవయవాలు వింతగా ఉన్నాయి. కాగా ఈదూడ వెంటనే చనిపోయింది. ఈదూడ వయస్సు ఆరు నెలలు ఉంటుందని పుట్టాల్సిన సమయానికి ముందే జన్మించిందని సురేందర్ చెప్పారు. జన్యులోపం కారణంగానే ఇలా జరిగి ఉంటుందని తెలిపారు.

తెలంగాణ ద్రోహులకు కేసీఆర్ టికెట్లు ఇచ్చారు


మాట్లాడుతున్న మందుల సామేల్

శాలిగౌరారం: తెలంగాణ ద్రోహులకే సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చారని రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ మందుల సామేల్ ఆరోపించారు. శనివారం శాలిగౌరారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు సీఎం కేసీఆర్ మాదిగలకు అన్యాయమే చేశారన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో టీఆర్‌ఎస్ పార్టీ ఏర్పడిన నాటి నుంచి తాను క్రియాశీలకంగా పనిచేస్తే స్థానికేతరులకు టికెట్ కేటాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ను ఓడించేందుకు మాదిగలంతా ఒక్కతాటి పైకి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రమావత్ శంకర్‌నాయక్, దర్శనం కృష్ణమూర్తి, భూపతి వెంకటేశ్వర్లు, కూతాటి సోములు, పుల్లూరు దేవేందర్, పడాల రమేశ్, దేవరకొండ జయరాజు తదితరులు పాల్గొన్నారు.

చేనేత మహాసభలను జయప్రదం చేయాలి

భువనగిరి(వలిగొండ) : నల్లగొండలో సెప్టెంబర్ 4,5 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ద్వితీయ మహాసభలకు చేనేత కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకటనర్సు పిలుపునిచ్చారు. శనివారం వలిగొండలో చేనేత సంఘం నాయకులతో కలిసి మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో గరుదాసు నర్సింహ, దొంత శంకరయ్య, బోడ ఈశ్వర్, సబ్బం రమేష్, ముడుదుడ్ల శేకర్, నర్మద, వెంకటేశం, జ్యోతి పాల్గొన్నారు.

దారికాచి.. కళ్లలో కారం కొట్టి..

- రూ.3.20లక్షలు దోపిడీ

నేరేడుచర్ల : గుర్తుతెలియని వ్యక్తులు దారికాచి కళ్లలో కారం కొట్టి రూ.3.20లక్షలు దోపిడీ చేశారు. ఈ ఘటన నేరేడుచర్ల మండల పరిధిలోని దిర్శించర్ల గ్రామ శివారులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పాలకీడు, జాన్‌పహాడ్‌లలోని వైన్స్‌లలో వచ్చిన కలక్షన్లు తీసుకొని ఆయా షాపుల్లో పనిచేస్తున్న నేరేడుచర్ల పట్టణానికి చెందిన కట్టు సుధాకర్‌రెడ్డి, బొలిశెట్టి శ్రీనులు బైక్‌పై నేరేడుచర్లకు బయలుదేరారు. నేరేడుచర్ల మండలం దిర్శించర్ల గ్రామ శివారులో గల సబ్ స్టేషన్ వద్దకు రాగానే సుధాకర్‌రెడ్డి, శ్రీనులు ఇరువురు కలిసి వస్తున్న ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు వెనుక నుంచి వచ్చి వాహనంతో ఢీకొట్టడంతో కిందపడిపోయారు. వెంటనే వారి కళ్లల్లో కారం కొట్టి పురుషపదాజాలంతో దూషిస్తూ వారి డిక్కీని పగులకొట్టి అందులో ఉన్న రూ.3.20లక్షలను దోపిడీ చేశారు. ఈ విషయంపై నేరేడుచర్ల పోలీస్ స్టేషన్‌లో సుధాకర్‌రెడ్డి, శ్రీనులు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ పరమేష్ కోదాడ డీఎస్పీ ప్రకాశ్, హుజూర్‌నగర్ సీఐ రామలింగారెడ్డిలకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

ముప్పై ఏళ్లుగా గుడిసెలో నివాసం

- శిథిలావస్థకు చేరిన పూరి గుడిసె
- తల్లీకొడుకు ఇద్దరూ దివ్యాంగులే
- ఆసరా పింఛన్‌తోనే జీవనాధారం
- గృహలక్ష్మి పథకం వర్తింపచేయాలని వేడుకోలు


మానసిక దివ్యాంగుడైన కుమారుడితో రాంబాయమ్మ

మునగాల(కోదాడ): తల్లీ కుమారుడు ఇద్దరూ దివ్యాంగులే. వచ్చే ఆసరా పింఛన్ డబ్బులతో జీవనం సాగిస్తున్నారు. గత 30 ఏళ్లుగా పూరిగుడిసెలోనే ఉంటున్నారు. ప్రస్తుతం అది కూడా శిథిలావస్థకు చేరుకొని కూలేందుకు సిద్ధంగా ఉంది. తమకు గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలని వేడుకుంటున్నారు. మునగాల మండల కేంద్రానికి చెందిన వెగ్గళం రాంబాయమ్మ(65)కు కుమారుడు, కుమార్తె ఉన్నారు. 32ఏళ్ల క్రితం ఈమె భర్త మృతిచెందాడు. కుమారుడు వెంకటేశ్వర్లు పుట్టుకతోనే మానసిక వికలాంగుడు. కుమార్తెకు వివాహం చేసి అత్తవారింటికి పంపింది. కూలీనాలీ చేసుకొని వికలాంగుడైన కుమారుడుని పోషిస్తూ పూరిగుడిసెలోనే జీవనం సాగిస్తోంది. కాగా రాంబాయమ్మ ఫైలేరియా బారిన పడి నడవలేని స్థితికి చేరుకోవడంతో వికలాంగుల కోటా కింద ఆసరా పింఛన్ మంజూరైంది. దాదాపు 30ఏళ్ల క్రితం ఏర్పాటు చేసుకున్న పూరిగుడిసె ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. వర్షమొస్తే ఇద్దరు జాగారం చేయాల్సిందే. ప్రభుత్వం నుంచి వచ్చే పింఛన్ డబ్బులు రోగాలు, మందులకే సరిపోవడంతో జీవనం మరింత దుర్భరంగా మారింది. ఒకపూట తిని, ఒకపూట పస్తులుండాల్సిన దుస్థితి నెలకొంది.

పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు..

తల్లీ, కుమారుడి దుస్థితి గురించి ప్రజాప్రతినిధులు, అధికారులెవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. ఎన్నికల సమయంలో వచ్చి తమకు ఓటేస్తే అన్ని ఇస్తాం అని మాయమాటలు చెప్పి, ఆ తర్వాత మొఖం చాటేస్తున్నారని వారు పేర్కొంటున్నారు. ప్రభుత్వం మంజూరు చేసే డబుల్ బెడ్ రూం ఇంటి కోసం దరఖాస్తు చేస్తే ఓ రాజకీయ నాయకుడు నీకు రాదులే అని మాట్లాడాడని వాపోయింది. బీసీ రుణం కోసం దరఖాస్తు చేసుకుంటే రాజకీయ అండదండలు లేకపోవడంతో అదీ చేజారి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం నిలువనీడ లేక అల్లాడుతున్న తమకు సుమారు 180 గజాల సొంత స్థలం ఉన్నందున గృహలక్ష్మి పథకం వర్తింపచేయాలని తల్లీకుమారుడు కోరుతున్నారు.

గృహలక్ష్మి పథకం వర్తింపచేయాలి



నివాసముంటున్న పూరిగుడిసె శిథిలావస్థకు చేరుకుంది. వర్షం వస్తే తడిసి పోతున్నాం. మానసిక వికలాంగుడైన కుమారుడిని సాదుకుంటూ జీవనం వెళ్లదీస్తున్నాను. ప్రభుత్వం మాకు గృహలక్ష్మి పథకం వర్తింపచేస్తే కనీసం ఉండేందుకు ఓ ఇల్లు నిలబడుతుంది.

– వెగ్గళం రాంబాయమ్మ, మునగాల